క్లుప్తంగా

గౌడ సంఘం కమిటీ ఎన్నిక



ఎల్కతుర్తి : మండలంలోని దండేపల్లి గ్రామంలో ఆదివారం గౌడ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మండ రాజ్‌కుమార్, ఉపాధ్యాక్షుడిగా బత్తిని బాలరాజు, సంఘం సభ్యులుగా బత్తిని ప్రభాకర్, మండ అశోక్, మండ చంద్రమౌళి, బత్తిని గోవర్ధన్, మండ రాజు, మండ శ్రీనివాస్, దూలం రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కురుమ సంక్షేమ సంఘం డివిజన్ కమిటీ ఎన్నిక

నర్సంపేట : పట్టణంలోని కురుమ సంక్షేమ సంఘం కార్యాలయంలో డివిజన్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుడగొండ భిక్షపతి, గౌరవ అధ్యక్షుడిగా కోరె సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కంకల రాజు, ఉపాధ్యక్షులుగా పోతరాజు బాబు, అమ్మ రాజేశ్, కోరె రాము, సహాయ కార్యదర్శిగా మొర్రి సంతోశ్, కోశాధికారిగా కంచు రాజు, ముఖ్య సలహాదార్లుగా అమ్మ రాజు, కిరణ్, అమ్మ ఓదెల, అమ్మ కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా నరిగె ప్రవీణ్, కోరే రాజేశ్, పోతరాజు లింగన్న, బుడిగొండ కుమారస్వామి, కడారి బీరయ్య, గణకులుగా అల్లి రవి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా అమ్మ రాజు, కాలే కుమారస్వామి వ్యవహరించారు.

లేబర్ కోడ్‌లతో కార్మికులకు నష్టం



ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్

వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులకు నష్టం కలిగించేలా ఉన్నాయని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుంచు జగదీశ్వర్ తెలిపారు. పట్టణంలో భూక్యా యాకూబ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఆటో ట్రాలీ యూనియన్ సమావేశానికి జగదీశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు సదుపాయం కల్పించి ఆటో కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఆటో కార్మికులు కుటుంబాలను పోషించుకోలేక దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి కుట్ర చేస్తోందని తెలిపారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, బీమా కల్పించాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, నెలకు రూ.4500 చొప్పున భృతి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమావేశంలో నాయకులు ముక్కెర రామస్వామి, తాటికాయల రత్నం, కన్నం కుమార్, మాంగ్యా, రమేశ్, శంకర్, శ్రీనివాస్,సంపత్, జన్ను స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతికి పొంగులేటి పరామర్శ

నర్సంపేట : స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని అతడి తల్లి కాంతమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ హోం మంత్రి కుందూరు జానారెడ్డి, జనగామ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి కుందూరు జైవీర్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తొలుత కాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పోలీసుల తనిఖీ



గీసుకొండ : మండలంలోని గొర్రెకుంట క్రాస్ రోడ్డు వద్ద స్థానిక పోలీసులు ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. సీఐ విశ్వేశ్వర్, ఎస్సై కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి పలువురికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. సరైన పత్రాలు లేని, హెల్మెంట్ ధరించని, నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు.

ఘనంగా పాస్టర్స్ డే

వర్ధన్నపేట : మండల కేంద్రంలోని ఎక్లేసియా పెంతోకోస్తు చర్చిలో ఆదివారం పాస్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సుమన్ మాట్లాడారు. ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు ఏసుక్రీస్తు ప్రయత్నిస్తుంటాడని తెలిపారు. ఏసుక్రీస్తు బోధనలు మనుషుల ఉత్తమ జీవితానికి బాటలు వేస్తాయన్నారు. క్రైస్తవ సంస్థలు చదువు, ఉద్యోగంతోపాటు నైతిక విలువలు పెంపొందిస్తున్నాయని చెప్పారు. అనంతరం సుమన్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అబ్రహం, సునీతమ్మ, శోభ, గోపాల్, రజిత, కుమార్, కృష్ణవేణి, దయాకర్, స్వరూప, బాబు, బ్లేస్సి, నిస్సి, అక్షయ్, ఆరాధ్య, అవినాశ్, అవంతిక, తదితరులు పాల్గొన్నారు.

మలుపులు, గుంతలు, పిచ్చిమొక్కలు



మలుపుల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

- కొత్తగట్టు సింగారం వెళ్లాలంటే జంకుతున్న వాహనదారులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

శాయంపేట : మండల కేంద్రం నుంచి కొత్తగట్టు సింగారం వరకు నిర్మించిన రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఓ వైపు గుంతలు, మరో వైపు పిచ్చిమొక్కలతో మలుపుల వద్ద ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు భయాందోలన చెందుతున్నారు. ఈ దారిగుండా వెళ్తే మూడు కిలోమీటర్ల ప్రయాణంలో కొత్తగట్టు సింగారం చేరుకోవచ్చు. ఈ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు రోడ్డును కమ్మేస్తున్నాయి. రోడ్డుపై గుంతలు ఏర్పడి, మలుపుల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాల జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, రోడ్డుకి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికులు, పలువురు వాహనదారులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మండల కేంద్రంలోని కొత్తగట్టు సింగారం బైపాస్ రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో పాటు మలుపుల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసి, పిచ్చిమొక్కలను తొలగించాలి. రోడ్డు ప్రమాదాలను నివారించాలి.

– అనుకారి శివాజీ, శాయంపేట

పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషిచేయాలి



శాయంపేట : చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



వేలేరు : చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ మేఘన



ఐనవోలు : చిన్నారిని పరీక్షిస్తున్న విజయ్‌కుమార్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట/ కమలాపూర్ : పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్ కోసం తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత అన్నారు. ఈ మహోత్తర లక్ష్య సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం చిన్నారుల భవిష్యత్ కోసం పోలియో చుక్కల కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సాయికృష్ణ, వైద్య సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని పిల్లలకు పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలని పల్స్ పోలియో రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాస్ అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. కాగా ఆత్మకూరు మండలంలో 90 శాతం పిల్లలకు పోలియో చుక్కలు చేశామని, మిగతా పిల్లలకు సోమ, మంగళవారంలో ఇంటింటికి వెళ్లి వేస్తామని సిబ్బంది తెలిపారు. అలాగే కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4,400 మందికి గాను 4,350 మందికి, ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1,487 మందికి గాను 1,419 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. కమలాపూర్, ఉప్పల్ పీహెచ్‌సీలతో పాటు బస్టాండ్, చావడి, కానిపర్తిలోని పల్స్ పోలియో కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వైద్యాధికారులు నాగరాజు, పద్మశ్రీ, పల్లె దవాఖానా వైద్యులు, ఆత్మకూరులో మండల వైద్యాధికారిని స్పందన, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదంతో ప్రభుత్వం పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలో 9 పల్స్ పోలియో కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. మొత్తం 1,177 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉండగా 1,083 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు వెల్లడించారు. ఎల్కతుర్తి పీహెచ్‌సీ పరిధిలో 20 కేంద్రాలు, ఒక మొబైల్ టీం ఏర్పాటు చేయగా మొత్తం 2,225 మంది పిల్లలకు గాను 2,161 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని వంగర పీహెచ్‌సీ పరిధిలో 2,208 మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లు డాక్టర్ రుబీనా, రెహమాన్ తెలిపారు. ముల్కనూరు పీహెచ్‌సీ పరిధిలో 1,819మంది చిన్నారులకు గాను 1,810మందికి చుక్కలు వేసినట్లు డాక్టర్ ప్రదీప్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాజశేఖర్, విజేందర్‌రెడ్డి, ఏఎన్‌ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దామెర : పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేంద్ర అన్నారు. ఆదివారం మండల వ్యాప్తంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, సబ్ సెంటర్లు, ముఖ్య కూడళ్లలో క్యాంపులు ఏర్పాటుచేసి 0–5 సంవత్సరాల పిల్లలకు చుక్కలు వేసినట్లు చెప్పారు. కాగా మండల వ్యాప్తంగా 98 శాతం మంది చిన్నారులకు చుక్కలు పంపిణీ చేశామన్నారు. ఎంపీహెచ్‌ఈఓ అశోక్ బాబు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఐనవోలు : మొదటి రోజు బూత్ ఆక్టివిటీలో 93 శాతం పల్స్ పోలియో లక్ష్యాన్ని పూర్తిచేసి 15 బూతులు, ఒక మొబైల్ టీం ద్వారా లక్ష్యాన్ని చేరుకున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని పున్నేలు, ఐనవోలు, పంథిని, నందనం గ్రామాల్లో అన్ని బూతులను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. టీకాల ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐదేళ్లలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.

వేలేరు : చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మేఘన అన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.



దామెర : చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది



ఎల్కతుర్తి : వంగరలో పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్



ఆత్మకూరు : పల్స్ పోలియో క్యాంపును పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాస్

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తాచాటాలి

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నల్లబెల్లి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి సత్తాచాటాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రంగాపురం ఎంపీటీసీ ఎన్నికల సన్నాహక సమావేశానికి రాణాప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున అన్ని స్థానాల్లో పోటీ చేసి అభ్యర్థులను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ ప్రచారం చేయడంతోపాటు హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, జిల్లా నాయకులు వనపర్తి మల్లయ్య, బచ్చు వెంకటేశ్వర్ రావు, వల్లె పర్వతాలు, మండల ప్రధాన కార్యదర్శులు ఈర్ల నాగరాజు, గుగులోత్ తిరుపతి, ఉపాధ్యక్షులు గుర్రపు నరేశ్, కార్యదర్శి మర్రి నాగరాజు, కోశాధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

మూఢనమ్మకాలకు చెప్పలతో చెక్..!



నర్సంపేట : పట్టణానికి చెందిన ఓ సామాజిక వేత్త స్థానిక శ్రీరామ్‌నగర్ కాలనీ దారిలో కొబ్బరికాయలు, నిమ్మకాయలు, కోడిగుడ్లు, పసుపు, కుంకుమ, అన్నం, చెత్త పెట్టడం చట్టరీత్యా నేరమని తెలుపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయినా ఎవరైనా పెడితే పెట్టిన వారి మెడలో పాత చెప్పులు వేసి గుండు గీయించి శ్రీరామ్‌నగర్ వార్డులో తిప్పుతామని పేర్కొన్నారు. కాగా చెప్పులతో మూఢనమ్మకాలకు చెక్ పెట్టేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది.

మహిళా సమస్యల పరిష్కారంలో విఫలం

- ఐద్వా జిల్లా కార్యదర్శి రత్నమాల

నర్సంపేట : మహిళా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల అన్నారు. పట్టణంలోని కాకతీయ కాలనీలో బిట్ర స్వప్న అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి రత్నమాల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో అనేక అడ్డంకులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమాజం ఎంతో ఉన్నతి సాధించినా, దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నా మహిళలు అణచివేతకు, అసమానతకు గురవుతూనే ఉన్నారని ఆందోళన వెలిబుచ్చారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బూటు విసిరిన లాయర్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు ఫరీదా, విజయ, నాగలక్ష్మి పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న రత్నమాల, నాయకులు

ప్రధాన రహదారిపై రాస్తారోకో



గీసుకొండ : ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారిపై ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరి వల్లే హైకోర్టు స్టే విధించిందని తెలిపారు. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కనకం సంధ్య, గూడ సురేశ్, సుధాకర్, రాజమౌళి, రంజిత్, జనార్దన్, శోభన్, కృష్ణమూర్తి, జావెద్, రమ, నసీమా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కాల్వలోనే చెత్తాచెదారం



కాల్వలో పడేసిన చెత్తాచెదారం

వేలేరు : చెత్తాచెదారం, వ్యర్థాలను వేసేందుకు ప్రభుత్వం డంపింగ్ యార్డులను ఆయా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసినా గ్రామాల్లోని కొంతమంది నిర్లక్ష్యంగా సమీపంలోని మురుగు కాల్వలోనే చెత్తాచెదారం పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుంది. కాల్వల్లో వ్యర్థాలు పడేస్తుండటంతో ఆదారి గుండా వెళ్లే వాహనదారులు, ఇతరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థలు, చెత్తాచెదారం పేరుకుపోవడం, నిత్యం నీరు పారుతుండడంతో సమీపమంతా కంపు కొడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కాల్వల్లో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లక్ష్యసాధనలో అడ్డంకులను అధిగమించాలి

- మెదక్ డిప్యూటీ కలెక్టర్ అహ్మద్‌పాషా



డిప్యూటీ కలెక్టర్ అహ్మద్‌పాషాను సన్మానిస్తున్న గ్రామస్తులు

దామెర : లక్ష్యసాధనలో ఎదురయ్యే అడ్డంకులను అధిగమించి విజయం సాధించాలని డిప్యూటీ కలెక్టర్ ముహ్మద్ అహ్మద్‌పాషా అన్నారు. మండలంలోని ఊరుగొండకు చెందిన అహ్మద్‌పాషా గ్రూప్–1లో ప్రతిభ కనబర్చి మెదక్ జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కాగా మొదటిసారిగా గ్రామానికి రాగా మస్జిదే ముఖర్రం కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ చదువుపైనే దృష్టిసారించానని అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరేందుకు కష్టపడి చదివానని, 2017లో జీడబ్ల్యూఎంసీలో ఇంజనీరుగా ఎంపికైనప్పటికీ గ్రూప్–1పై ఆసక్తితో ప్రిపరేషన్ కొనసాగించినట్లు చెప్పారు. కంటి సమస్య ఉన్నప్పటికీ మనోధైర్యంతో చదువు కొనసాగించానన్నారు. అనంతరం కమిటీ సభ్యులు, గ్రామస్తులు గజమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశానికి ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మైనారిటీ కమిటీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ, తాజుద్దీన్, సాబిర్‌అలీ, ఆజంఖాన్, రషీద్, ఖైరత్, జహీర్, ముజీబ్, మాలిక్, మధార్, అజెం, గండు రాము, బండి సతీశ్, రామకృష్ణారెడ్డి, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని అహ్మద్‌పాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.

టైరు పేలి వాహనం బోల్తా

- తొమ్మిది మందికి స్వల్ప గాయాలు



బోల్తా పడిన టాటామ్యాజిక్‌లో నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న యువకులు

కమలాపూర్ : మంలంలోని ఉప్పల్ మీదుగా వేములవాడ వెళ్తున్న టాటామ్యాజిక్ వాహనం టైర్ పేలడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో టాటామ్యాజిక్‌లో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా జంగాలపల్లి నుంచి టాటామ్యాజిక్ వాహనంలో డ్రైవర్‌తో సహా తొమ్మిది మంది వేములవాడకు బయలుదేరారు. ఈ క్రమంలో ఉప్పల్ శివారులోకి రాగానే వాహనం ఎడమ వైపు ఉన్న ముందు టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై మధు, సిబ్బంది, స్థానిక యువకులు హుటాహుటిన అక్కడకు చేరుకుని టాటామ్యాజిక్‌లో నుంచి క్షతగాత్రలను బయటకు తీసి 108 ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ



బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ గ్రామస్తులకు కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చలివాగు ప్రాజెక్టు మాజీ చైర్మన్ ఇమ్మడిశెట్టి సదానందం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పడి 22 నెలల గడుస్తున్నా ఒక్క గ్యారంటీని అమలు చేయలేదని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పైండ్ల శ్రీనివాస్, కోగిల రవికిరణ్, నాగెల్లి సురేశ్, కోగిల రవి, తిరుపతి, శంకర్, రాజేశ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పగలే వీధి దీపాల వెలుగులు



విద్యుత్ స్తంభానికి వెలుగుతున్న లైట్

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. మరికొన్ని చోట్ల రాత్రివేళ వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. దసరా పండుగ సందర్భంగా కొన్ని గ్రామ పంచాయతీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయగా వాటి నిర్వహణను పంచాయతీ అధికారులు తమ సిబ్బందికి అప్పగించారు. ప్రతీరోజు ఉదయం వీధి దీపాలను ఆఫ్ చేయకపోవడంతో రోజంతా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో బల్బుల సామర్థ్యం తగ్గి త్వరగా పాడవుతున్నాయని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యహరిస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.

‘అంజి’ కళ్లు సజీవం



గూడెల్లి అంజి (ఫైల్)

కమలాపూర్ : అతడు భౌతికంగా లేకున్నా ఇద్దరికి చూపునిచ్చాడు కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌కు చెందిన గూడెల్లి అంజి. ఈనెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతిచెందిన విషయం తెలి సిందే. కాగా చూపు కోల్పోయిన ఇద్దరు వ్యక్తులు నేత్రదాతల కోసం ఎదురు చూస్తున్నారు. వైద్యుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న అంజి కుటుంబ సభ్యులు తండ్రి సదయ్య, తల్లి భాగ్యలక్ష్మి, భార్య సృజన, కూతుర్లు సాన్వి, మహీర అంజి కళ్లు దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు అంజి కళ్లను సేకరించి చూపు కోల్పోయిన ఇద్దరికి అమర్చారు. నేత్ర దానం చేసి ఇద్దరికి చూపు ప్రసాదించిన అంజి కుటుంబ సభ్యులను పలువురు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కాగా బాధిత కుటుంబాన్ని మాదాపూర్ డీసీపీ పుల్లా శోభన్‌కుమార్, పెద్దపల్లి డీసీపీ పుల్లా కరుణాకర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి కొంత ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగులు నింపినట్లు అని, ఆ కుటుంబాన్ని అభినందించారు. మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, గ్రామస్తులు ఎర్రబెల్లి శ్రీధర్‌రావు, జక్కుల రాజు తదితరులు ఉన్నారు.